ప్రజాశక్తి

బుధవారం 8 మార్చి 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా







మహిళా అధికారులను సన్మానించిన కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.డిల్లీరావు తదితరులు

మహిళా అధికారుల పాత్ర అభినందనీయం : కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లా అభివృద్ధిలో మహిళా అధికారుల భాగస్వామ్యం అనిర్వచనీయమని, రెవెన్యూ, విద్యా, వైద్య, గ్రామీణ ఉపాధి, వ్యవసాయం వంటి కీలక రంగాలతోపాటు కుటుంబ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తున్న మహిళా అధికారులు అభినందనీయులను జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా జిల్లాలో పలు ప్రభుత్వ శాఖల్లో సేవలందిస్తున్న జిల్లా స్థాయి అధికారులను మంగళవారం ఆయన ఘనంగా సన్మానించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మట్లాడుతూ జిల్లాలో పునర్వ్యవస్థీకరణ అనంతరం ఏర్పడిన ఎన్‌టిఆర్ జిల్లాలో సగానికి పైగా మహిళా అధికారులే ఉన్నారన్నారు. జిల్లా పరిపాలనలో జాయింట్ కలెక్టర్ హోదాలో ఎస్ నూపూర్ అజయ్, సబ్ కలెక్టర్ హోదాలో అదితి సింగ్ అందిస్తున్న సహకారం మరువలేదన్నారు. మహిళా అధికారుల కఠోర కృషి ఫలితంగానే ఎన్‌టిఆర్ జిల్లా అభివృద్ధి చెందుతోందన్నారు. విద్య, వైద్య, గృహ నిర్మాణం, గ్రామీణ ఉపాధి (మిగతా 6లో)

మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి : డి.రమాదేవి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సమాజంలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం విజయవాడ వన్‌టౌన్ 50వ డివిజన్ ఖాదర్ సెంటర్లో ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో సాంస్కృతిక బహిరంగ సభ జరిగింది. ఈ సభలో రమాదేవి మాట్లాడుతూ నేడు రోజురోజుకూ మహిళలపై హత్యలు, అత్యాచారాలు ఎక్కువైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యాన్ని నియంత్రిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదని విచారం వ్యక్తం చేశారు. ఐద్వా ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి మాట్లాడుతూ 'అందర్నీ కలుపుకుందాం, అందరూ ఒక్కటే' అనే ఐక్యరాజ్యసమితి ఇచ్చిన పిలుపు అమలు జరిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. శ్రామిక మహిళ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ ఏ.కమల మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్తు పదార్థాల నియంత్రణకు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. భవానీపురంలోని నేతాజీ స్కూల్ విద్యార్థులు 'మహిళా దినోత్సవం'పై గేయాన్ని ఆలపిస్తూ చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. దాసరి రాజేశ్వరి నత్యాలయం వారి నత్య ప్రదర్శనలు, ఐద్వా పశ్చిమ నగర కమిటీ ఆధ్వర్యంలో అభ్యుదయ గీతాలకు నత్య రూపకం, మహిళల ఆత్మరక్షణకు జి.వరలక్ష్మి బందం చేసిన కరాటే ఆకర్షించాయి. ఈసభలో ఐద్వా పశ్చిమ అధ్యక్ష కార్యదర్శులు కుండనాల శేషుమణి, జి.ఆదిలక్ష్మి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు, సిఐటియు పశ్చిమ అధ్యక్ష కార్యదర్శులు జి.వెంకటరావు,ఇ.వి.నారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

ఖాళీగా ఉన్న స్థానిక సంస్థల ఎన్నికలకు

ముసాయిదా జాబితా విడుదల

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లాలో వివిధ కారణాల వల్ల స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న 33 స్థానాల ఎన్నికలకు ముసాయిదా జాబితా విడుదల చేసినట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. మంగళవారం మచిలీపట్నం కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు, డ్వామా, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వి.సూర్య నారాయణతో కలిసి ఆయన డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఉయ్యూరు జడ్‌పిటిసి, ఉంగుటూరు మండలం తేలప్రోలు 1 ఎంపిటిసి, పెడన మున్సిపల్ 11 వార్డు, గూడూరు మండలం కోకనారాయణ పాలెం సర్పంచ్, పెడన మండలం కొంగంచర్ల సర్పంచ్ తదితర 33 స్థానాల్లో అభ్యర్థుల ఎన్నికకు ముసాయిదా పోలింగ్ జాబితా విడుదల చేసినట్లు తెలిపారు. ఈనెల 7వ తేదీలోపు అభ్యంతరాలు తెలియజేయాలని, 9న పరిశీలన చేపట్టి, 10న తుది జాబితా ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం ఆయన గహ నిర్మాణం, స్వామిత్వ సర్వే, రీ సర్వే, లంక భూములు సర్వే, స్పందన, గ్రీవెన్స్, రబీలో సాగునీటి ఎద్దడి తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ నాగేశ్వర నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ సత్యనారాయణ రాజు, డిఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, సాధికారత అధికారి కె.సరస్వతి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎం.ఫణి ధూర్జటి, కలెక్టరేట్ తహశీల్దారు హరినాథ్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.10లక్షలు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం జామియా మసీదు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మాజీ మంత్రి, శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) రూ.10 లక్షలను ప్రకటించారు. కమిటీ సభ్యులకు మంగళవారంనాడు ఈ మొత్తాన్ని యువజన విభాగం జోనల్ ఇంచార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అందజేశారు. మైనారిటీ సెల్ జోనల్ ఇంచార్జ్ షైక్ సిలార్ దాదా, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ అచ్చేబా, వైసీపీ మైనారిటీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

సహాయ ఫౌండేషన్ సేవలు అభినందనీయం : కలెక్టర్



కలెక్టరేట్ (కృష్ణా) : గత ఏడు సంవత్సరాలుగా సహాయ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యమాలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. సహాయ ఫౌండేషన్, స్టార్ హెల్పింగ్ హబ్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పేదలకు ఆహారాన్ని అందించే వాహనాన్ని జిల్లా కలెక్టర్ మంగళవారం కలక్టరేట్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ పేదవారి కోసం సేవా కార్యమాలు నిర్వహిస్తున్న సహాయ ఫౌండేషన్ వారిని కలెక్టర్ అభినందించారు. ఇక నుంచి ప్రతి నెలా కొంతమంది పేదలకు ఆహారం అందించటానికి తాను కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగుల సహకారంతో సహాయ ఫౌండేషన్ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతామన్నారు. జాయింట్ కలెక్టర్ అపరజిత సింగ్, డిఆర్‌ఒ ఎం వెంకటేశ్వర్లు, సహాయ అధ్యక్షులు ఎం డి. ఉస్మాన్ బాషా, సహాయ లీగల్ సెల్ చైర్మన్ లంకిశెట్టి బాలాజీ, సంస్థ గౌరవ అధ్యక్షులు పెర్నేటి శ్రీరామ్,ఫుడ్ కమిటీ చైర్మన్ రౌతుల ప్రసద్ స్టార్ కాలేజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు



తోట్లవల్లూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ఆదర్శ పాఠశాలలో యుటిఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో 11 మంది మహిళలను ఘనంగా సత్కరించారు. మండల యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎం. విజయ శ్రీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షులు బి. హిమ కుమారి, రాష్ట్ర కౌన్సిలర్ ఆర్.రామారావులు 11 మంది మహిళలను సత్కరించారు.



వేడుకల్లో మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ దినకర్

విఎంసిలో మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - విజయవాడ : స్థానిక విఎంసిలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ (జనరల్) ఎం శ్యామల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కార్పొరేటర్ అబ్దుల్ అకీమ్ అర్షద్, నగరపాలక సంస్థ మహిళా ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వ్యవస్థాపకులు క్లారా జెట్కిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అందరితో కలిసి మేయర్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజనీర్ యం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. పి.రత్నావళి తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో కలిసి పాల్గొన్న కొల్లు నీలిమ

సాధికారతకు కొల్లు ఫౌండేషన్ కృషి : కొల్లు నీలిమ

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : మహిళా సాధికారతే ధ్యేయంగా కొల్లు ఫౌండేషన్ కృషిచేస్తోందని కొల్లు నీలిమ పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మచిలీపట్టణం లలిత కన్వెన్షన్‌లో మంగళవారం నిర్వహించిన మహిళాదినోత్సవం మహిళా సాధికారత, మహిళల దశ, దిశా మార్గనిర్దేశకం చేసేలా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఐబిసి ఛానల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, శైలాష్ కిచెన్ యు ట్యూబ్ ఫౌండర్ ఏచూరి శైలజ , ఎంట్రప్రెన్యూర్ లింగమనేని వరలక్ష్మి, ప్రముఖ న్యాయవాది శంషాద్, ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ కాట్రగడ్డ నాగలక్ష్మి, ప్రముఖ ఆధ్యాత్మిక సేవమని దేసు అన్నపూర్ణ, ప్రముఖ రచయిత్రి చిల్లరిగే ప్రమీల, ప్రముఖ బ్యూటిషన్ సుధా పాల్గొన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందించిన మహిళామణులకు సన్మానం చేశారు.



వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తోట్లవల్లూరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సాయి ప్రసన్న

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తోట్లవల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సాయి ప్రసన్న అన్నారు. తోట్లవల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 13 సచివాలయాల హెల్త్ వెల్నెస్ సెంటర్లలో 'జన్ ఔషిధి దివాస్‌ను మంగళవారం నిర్వహించారు. ప్రజల్లో అసంక్రమణ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి అవగాహన కల్పించారు. డయాబెటిస్, హైపర్ టెన్షన్ వారికి నెలకు సరిపడా మందులను అందజేశారు. ప్రతి హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో ఎమ్మెల్ హెచ్ పి లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలలు తమ పరిధిలోని ప్రజలకు మందులు పంపిణీ చేశారు. ఏటేటా దేశవ్యాప్తంగా జన్ ఔషిడి డివాస్ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.



మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : అన్ని దానాల కన్నా అమూల్యమైనది, వెలకట్టలేనిది రక్తదానమేనని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసాద్ అన్నారు. స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని గుడివాడ రోటరీ క్లబ్, రెడ్ క్రాస్ సొసైటీ వారి సంయుక్తంగా నిర్వహించారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రమణమూర్తి, సెక్రటరీ నరేష్, డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ వై ఆర్ చౌదరి, ఎ.సుబ్రహ్మణ్యం, బి.శంకర్రావు, వీరేంద్ర, ఫిలిప్, మెడికల్ ఆఫీసర్ పద్మావతి, రెడ్ క్రాస్ సొసైటీ ప్రముఖులు భవిరి శంకర్నాథ్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.కోదండ రామారావు, డాక్టర్ పి.రవీంద్రబాబు, డాక్టర్ బి.నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ అద్దంకి నాంచారమ్మ జాతర

ప్రజాశక్తి-కోడూరు

కోడూరు మండలంలో మండలం విశ్వనాథపల్లి గ్రామంలోనిశ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని కోడూరు మండలం విశ్వనాథ పల్లి గ్రామ జనసేన పార్టీ నాయకులు,తోట లక్ష్మణరావు ముప్పిడిశెట్టి ,కొండవీటి శివరాం, గోళ్ళ మల్లి, కొప్పనాతి వెంకటేశ్వరరావు, ఆధ్వర్యంలో సుమారు ఇరవై వేల మంది భక్తులు కు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉచిత మజ్జిగ పంపిణీ ముఖ్య అతిథిగా ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. అనంతరం బండ్రెడ్డిజ రామకృష్ణ పుట్టినరోజును పురస్కరించుకుని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు కేకులు కట్ చేసి ,మిఠాయిలు పంచిపెట్టారు.. అనంతరం శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో కోడూరు మండలం జనసేన పార్టీ సీనియర్ నాయకులు,లంకే యుగంధర్ ,యర్రంశెట్టి దామోదర్, ఉల్లి శేషగిరిరావు,బడే వెంకటేశ్వరరావు, తదితరులుపాల్గొన్నారు.

మోపిదేవి : మోపిదేవి మండలం పెదప్రోలు గ్రామంలో గ్రామ దేవతగా కొలువైన శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. జాతరను పురస్కరించుకొని పలు ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమల సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కోరిన కోర్కెలు తీరుస్తూ, భక్తుల పాలిటి ఇలవేల్పుగా ప్రసిద్ధిగాంచడంతో భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలసిల స్వర్ణలత, ప్రధాన కార్యదర్శి పైడిపాముల కృష్ణకుమారి, విశ్వనాథపల్లి పాప, నియోజకవర్గ అధ్యక్షురాలు బండే కనకదుర్గ, ప్రధాన కార్యదర్శి మొర్ల జయలక్ష్మి, తదితరులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆకుల వెంకటరామయ్య, కుర్ర గురు ప్రసాద్, కేవీయన్ కె కోటేశ్వరరావులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న యాత్రికులు

సందడిగా వికెఆర్ కళాశాలలో వేడుకలు

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని వేములపల్లి కోదండ రామయ్య (వీకేఆర్) కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ సైన్స్ స్టూడెంట్స్ ఫేర్ వెల్ కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా.. ఉల్లాసంగా.. భావోద్వేగాల నడుమ జరిగింది. రావి దివ్య, లతీబి తమకు కళాశాలతో ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మీ జీవితంలో ఒక ముఖ్యమైన అధ్యాయం ముగియబోతోందన్నారు. అలాగే జీవితం మరో సరికొత్త అధ్యాయం కోసం ఎదురుచూస్తోందన్నారు. కళాశాల కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు నవీన్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులను దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



మహిళా కార్పొరేటర్లు, అధికారులకు సన్మానం

ప్రజాశక్తి-విజయవాడ: స్థానిక ఐవి ప్యాలెస్‌లో నగరపాలక సంస్థ, యుసిడి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. మెప్మా ఎండి విజయలక్ష్మీ, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్లు బెల్లందుర్గ, ఆవుతు శ్రీశైలజ, తూర్పు నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మహిళా కార్పొరేటర్లను, అధికారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి) శకుంతల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

వైభవంగా అచ్చం పేరంటాలమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి-గంపలగూడెం: మండలంలోని వినగడప శివారు శ్రీ అచ్చం పేరంటాల అమ్మవారి మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తిరుణాళ్లకు వివిధ ప్రాంతాల నుండి యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 8వ తేదీ గురువారం జాతర ఉన్నట్లు కమిటీ సభ్యులు మేచినేని నాగమల్లేశ్వరరావు, పెమ్మిరాజు ఆంజనేయులు తెలిపారు.

మహిళే మానవాళికి మార్గదర్శి

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కృష్ణాజిల్లా చైర్మన్ టిఎస్ఎస్ బాలాజీ

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్



మహిళే మానవాళికి మార్గదర్శి అని మనం అనుక్షణం జ్ఞాపకం ఉంచుకోవాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కృష్ణాజిల్లా శాఖ చైర్మన్ టి ఎస్ ఎస్ బాలాజీ చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించు కుని స్థానిక పట్టాభి రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో ఆయన ఒక మంగళవారం ప్రకటన విడుదల చేశారు. రక్తదానపు ప్రాథమిక సూత్రాలను ప్రేరేపించ గల గురుతరకార్యం కోసం మహిళలు ముందుకు రావాలని కోరారు. జనసంఖ్య పరంగా మనదేశంలో పురుషులు, స్త్రీలు 50:50 నిష్పత్తిలో ఉన్నారనుకుంటే, రక్తదాతల విషయంలో ఈ నిష్పత్తి 95:05, రక్తం వినియోగ పరంగా 40:50 నిష్పత్తిలో ఉందన్నారు. కాగా రక్తదాన ప్రక్రియలో స్త్రీల పాత్రకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. స్త్రీ, పురుషుల్లో శారీరకంగా, మానసికంగా కొన్ని ప్రత్యేకతలున్నాయన్నారు. పసి పిల్లలను లాలించి, పెంచి పెద్ద చేసే గురుతర బాధ్యతలను ప్రేమాభిమానాలతో నిర్వహించే స్త్రీకి రక్తదాత పాత్ర కూడా అంతే బాధ్యతాయతంగా నిర్వహించ గలిగిన శక్తి, సామర్థ్యం, యోగ్యతలున్నాయన్నారు. అయితే పురుషుల బరువులో ఒక కిలో గ్రాముకి 76 మిలీ రక్తపు పరిమాణంతో పోలిస్తే స్త్రీల రక్తపు సరాసరి పరిమాణం 66 మిలీ ఉంటుందని పేర్కొన్నారు. ఓపిగ్గా చెప్పి ఆచరణ యోగ్యమైన రక్తదానపు ప్రాథమిక సూత్రాలను ప్రేరేపించగల గురుతర కార్యం స్త్రీ మాత్రమే చేయగలుగుతుందనీ వివరించారు. ఒక వ్యక్తిని సముచితంగా బోధించ గలిగితే ఆ వ్యక్తినే యోగ్యుడిగా తీర్చిదిద్దిన వాళ్ళమవుతామని, ఒక స్త్రీకి బోధించ గలిగితే ఒక సంపూర్ణ కుటుంబాన్నే తీర్చిదిద్దగలుగుతామన్నారు. స్త్రీ శక్తికి సమాజాన్ని మార్చే బాధ్యతలు ఇస్తే ఎంతో హుందాగా, నేర్పరితనంతో రక్తదాన ఉద్యమానికి చేయూతనిచ్చే శక్తిగా ఎదగగలుగుతుందని తెలిపారు.


ఎరువుల యాజమాన్యంపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మట్టి నమూనా సేకరణ, భూసార పరీక్షల ఆధారం ఎరువులు యాజమాన్యంపై నేషనల్ ఫెర్టిలైజర్ లిమిటెడ్ వారి సహకారంతో శిక్షణ, అవగాహనా సదస్సు మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత మట్టి పరీక్షలు ముఖ్య ఉద్దేశ్యం గురించి రైతులకు తెలిపారు. మట్టిలో పోషక విలువలను సంరక్షించుకునేందుకు యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలన్నారు. పచ్చిరొట్ట ఎరువుల వాడకం ద్వారా వ్యవసాయంలో దిగుబడులు సాధించొచ్చునన్నారు. రసాయన ఎరువులపై పెట్టే పెట్టుబడులు తగ్గించుకుని, దిగుబడులు పెంచుకునే దిశగా వ్యవసాయంలో మార్పులు రావటం అవసరమన్నారు. ఎన్‌ఎఫ్ఎల్ ఏరియా మేనేజర్ వంశీకృష్ణ మట్టి పరీక్షలు, జీవన ఎరువుల గురించి వివరించారు. జిల్లా ఇన్చార్జ్ రవి నాయక్ జీవన ఎరువులు ఎలా ఉపయోగించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వి.మంజువాణి, డాక్టర్ కె.రేవతి, డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి డాక్టర్ వి.నవీన్ కుమార్, యశ్వంత్ కుమార్, కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పి.శ్రీలత

ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాలు
బుధవారం
8 మార్చి 2023













వైసిపి హయాంలో ముస్లిములకు పెద్దపీట

జగ్గయ్యపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: నాలుగు కార్పొరేషన్ చైర్మన్లను, శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌ను ముస్లిములను నియమించిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందని జగ్గయ్యపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత సాధన వైసిపి ప్రభుత్వంలోనే సాధ్యపడుతుందన్నారు. షాదీతోఫా ద్వారా ముస్లిం యువతుల పెళ్లికి లక్ష రూపాయలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఆడపిల్లల రక్షణకు దిశ చట్టం ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

టిడిపితోనే మహిళలకు న్యాయం

జగ్గయ్యపేట పదో వార్డు కౌన్సిలర్ రామలక్ష్మి ప్రసాద్




ప్రజాశక్తి-జగ్గయ్యపేట: రాష్ట్రంలోని మహిళలకు న్యాయం జరగాలంటే టిడిపితోనే సాధ్యమని జగ్గయ్యపేట పదో వార్డు కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ వైసిపి అరాచక పాలన సాగిస్తోందన్నారు. రాష్ట్ర హోం మంత్రి ఒక మహిళ అయినప్పటికీ మహిళలపై దాడులు ఆపలేకపోతున్నారని విమర్శించారు. ఇటీవల కాలంలో జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు మహిళా కౌన్సిలర్లపై దాడికి దిగడం దుర్మార్గమన్నారు.

వైసిపికి మహిళల పట్ల చిత్తశుద్ధి లేదు

టిడిపి అంగన్వాడీ, డ్వాక్రా సాధికారత కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సునీత

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: వైసిపికి మహిళల పట్ల చిత్త శుద్ధి లేదని టిడిపి అంగన్వాడీ, డ్వాక్రా సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత విమర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు సంక్షేమ పథకాలు అందిస్తామని, మహిళా సాధికారత సాధిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వైసిపి నేతలు ఆ తర్వాత విస్మరించారన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలోనే డ్వాక్రా మహిళలు అతిసూక్ష్మ స్థాయి నుండి ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు డ్వాక్రా, అంగన్వాడీ, ఆశా వర్కర్లకు పెద్దపీట వేస్తామని అన్నారు.



అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపల్ లావణ్య



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: నేడు సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపల్ కె.లావణ్య అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీబాయి, రాణి రుద్రమదేవి, కవయిత్రి మొల్ల, సరోజినీ నాయుడు వంటి వీరవనితల స్ఫూర్తితో నేడు మహిళలు అన్నిరంగాల్లో ముందుంటున్నారని చెప్పారు. ప్రతి మహిళ తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని, నేడు మహిళలు చూపిస్తున్న ప్రతిభాపాటవాలను చూసి తాను గర్వపడుతున్నానని అన్నారు.

చదువుతోనే మహిళాభివృద్ధి

గ్రేడ్-1 గ్రంథాలయ అధికారిణి ప్రభ



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నా, మహిళ సాధికారత సాధించాలన్నా చదువు ముఖ్యమని జగ్గయ్యపేట గ్రేడ్-1 గ్రంథాలయ అధికారిని ఎ.ప్రభ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలను ఉపయోగించుకొని ప్రతి ఒక్కరూ విజ్ఞానాన్ని సంపాదించుకోవాలన్నారు. నేడు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకొని తద్వారా అభివృద్ధి చెందాలన్నారు. భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలు ఎంతో గొప్పవని, వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని అన్నారు.

వైసిపి హయాంలో మహిళలకు ప్రాధాన్యత

భీమవరం సర్పంచ్ వెంకటసుజాత




ప్రజాశక్తి-వత్సవాయి: వైసిపి ప్రభుత్వ హయాంలో మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు భీమవరం గ్రామ సర్పంచ్ బీమాల వెంకటసుజాత అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ దిశ చట్టం మహిళలపై దాడులు జరగకుండా అరికట్టవచ్చన్నారు. నేడు అన్ని పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారన్నారు. మహిళలు మరింత అభివృద్ధి చెందాలన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.

వైసిపి ప్రభుత్వంలో మహిళలకు ప్రాధాన్యత

పరిటాల గ్రామ సర్పంచ్ యద్దనపూడి ఆనంద జ్యోత్స్న

ప్రజాశక్తి-కంచికచర్ల : వైసిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇస్తున్నారని కంచికచర్ల మండలం పరిటాల గ్రామ సర్పంచ్ యద్దనపూడి ఆనంద జ్యోత్స్న అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె ప్రజాశక్తికి ఇంటర్వ్యూ ఇస్తూ మహిళలకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం కల్పించటమేగాక నామినేటెడ్ పదవుల్లో కూడా రిజర్వేషన్ కల్పించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. మహిళల రక్షణ కోసం వైసిపి ప్రభుత్వం దిశా చట్టం తీసుకురావడమే కాకుండా చిత్తశుద్ధితో అమలు చేస్తోందన్నారు. డ్వాక్రా మహిళలు స్వయంశక్తితో ఎదిగేందుకు ప్రభుత్వం డ్వాక్రా సంఘాలను బలోపేతం చేస్తోందన్నారు. మహిళలకు హోంమంత్రి పదవి ఇవ్వడంతోపాటు మంత్రివర్గంలో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. మహిళలు ఉన్నత చదువులు చదివి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అయితే స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల గడిచినా పార్లమెంట్లో మహిళా బిల్లు ఆమోదం పొందకపోవడం విచారకరమన్నారు. పార్లమెంట్లో మహిళా బిల్లు ఆమోదానికి అన్ని రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు.



స్త్రీ పురుషుల సమానత్వంతోనే

సమాజ పురోభివృద్ధి సాధ్యం

- ప్రజాశక్తితో విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి
- మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి
- అన్ని పదవుల్లో మహిళలకు ప్రాధాన్యత



ప్రజాశక్తి-విజయవాడ

అన్ని రంగాల్లో పురుషులకు ధీటుగా మహిళలు రాణిస్తున్నా పురుషాధిక్య సమాజంలో స్త్రీ నేటికీ వారు అణచివేతకు గురవుతూనే ఉన్నారని విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివక్ష, అణచివేతను రూపుమాపడానికి స్త్రీ-పురుషుల్లో ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అనే భావన తొలగిపోవాలని అన్నారు. సమ భావన, సమానత్వం సాధించిననాడే సమాజం ముందుకు పోతుందన్నారు. మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తికి ఆమె ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు. జనాభాలో సగ భాగంగా ఉన్న మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. మహిళాభ్యున్నతికి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ప్రశ్న : ఎంతో రాజకీయ చైతన్యం కలిగిన విజయవాడ నగర మేయర్‌గా మీకు ఎలా అవకాశం వచ్చింది ?

నేను మేయర్ స్థాయిలో ఉండటానికి ప్రధాన కారణం నా భర్త రాయన నరేంద్ర సహకారం, ప్రోత్సాహం. మా కుటుంబం అండదండలు అన్ని రకాలుగా నాకు ఉన్నాయి. రాజకీయ నేపథ్యం కలిలిగిన మా కుటుంబానికి మేయర్ స్థానంలో నేను ఉండటానికి ప్రధాన కారణం నా రాజకీయ గురువుగా భావించే పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావుగారి సహకారమే. ఆయనకు మా కుటుంబం రుణపడి ఉంటుంది. కార్పొరేటర్‌గా గెలిచి తీరాలనే ఆలోచనే తప్ప ఈ స్థాయిలో ఉంటానని నేనుగానీ, మా కుటుంబంగానీ ఏనాడూ ఊహించలేదు. కార్పొరేటర్‌గా గెలవడమేగాక అనూహ్య పరిణామాల నేపథ్యంలో ఒక బిసి మహిళగా నన్ను మేయర్ అభ్యర్థిగా ఆనాడు ఎంఎల్‌ఎ వెలంపల్లి శ్రీనివాసరావు గుర్తించి, ప్రోత్సహించి ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లి సిఫార్సు చేశారు. రాష్ట్రంలో నగరాలు సామాజికవర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిగారు నన్ను మేయర్ స్థానానికి ఓకే చెప్పారు.

ప్రశ్న : మీ రాజకీయ నేపథ్యం ఏమిటి ?

పశ్చిమ నియోజకవర్గంలో మొదటి నుంచీ మా కుటుంబం రాజకీయ నేపథ్యం కలిగి ఉంది. మా మామయ్య రాయన విశ్వనాధరావు ఆనాడే ఎంఎల్‌ఎగా పోటీ చేశారు. పాత 30వ డివిజన్ (లంబాడీపేట) ఎస్‌టి సామాజికవర్గానికి రిజర్వు కావడంతో మురళీనాయక్‌ను కార్పొరేటర్‌గా ఆ ఎన్నికల్లో మా కుటుంబమే పోటీ చేయించింది. మళ్లీ 2014లో కాంగ్రెస్ తరుపున నేను కార్పొరేటర్‌గా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచాను. 2020లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో 46వ డివిజన్ బిసి మహిళకు రిజర్వు అయ్యింది. నాకు పోటీ చేసే ఆలోచన లేకపోయినా నా భర్త ప్రోత్సాహం, ఎంఎల్‌ఎ వెలంపల్లి సహకారంతో పోటీ చేసి గెలుపొందాను. 2021 మార్చి 18న మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేశాను. 28 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ నేపథ్యంలోనే నేను ఈనాడు ఈస్థాయిలో ఉండగలిగాను. తమ్మిన పోతరాజు, రాము, మురిపల్లి చిట్టియ్య వంటి ఎందరో రాజకీయ ఉద్దండులు మా సామాజిక వర్గం నుంచి వివిధ రాజకీయపక్షాల తరపున పోటీచేసి ఎంఎల్‌ఎలుగా గెలుపొందారు. ముఖ్యంగా మా కుటుంబానికి కమ్యూనిస్టు నేపథ్యంలో ఉంది. నేటికీ వారంటే మాకు ఎంతో అభిమానం, గౌరవం ఉంది.

ప్రశ్న : మహిళలకు రాజకీయపరమైన పదవుల్లో వైసిపి ప్రభుత్వం ఎటువంటి అవకాశాలు కల్పిస్తోంది? విఎంసి పరిధిలో మహిళల పరిస్థితి ఏమిటి ?

రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులు దగ్గర నుంచి ఆయా కార్పొరేషన్ల పదవులు, స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ పద్ధతిని వైసిపి ప్రభుత్వం పాటిస్తోంది. విజయవాడ నగరంలో అయితే దానికి మించి అవకాశాలు కల్పించింది. నగరంలో కో-ఆప్షన్ సభ్యుల దగ్గర నుంచి కార్పొరేటర్ల వరకు వైసిపి తరుపున 37 మంది మహిళా కార్పొరేటర్లు ఉన్నారు. మేయర్, ఇద్దరు డిప్యూటీ మేయర్లు అందరూ మహిళలే. రాజకీయంగానే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కూడా మహిళలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. రేషన్ కార్డులు మంజూరు దగ్గర నుంచి ఇళ్ల స్థలాలు, అమ్మఒడి, ఇతర పథకాలన్నీ కూడా మహిళల పేరుతోనే ప్రభుత్వం మంజూరు చేస్తున్న విషయం తెలిసిందే. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడ నగర పాలక సంస్థ మహిళలకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కంచికచర్ల తహశీల్దారు వి.రాజకుమారి



ప్రజాశక్తి-కంచికచర్ల: మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కంచికచర్ల తహశీల్దార్ వి.రాజకుమారి అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ సమాజంలో పురుషులతో ధీటుగా మహిళలు రాణించేందుకు ఉన్నత చదువులు చదవాలన్నారు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా మహిళలు విద్యా, వైద్య, రాజకీయ రంగాల్లో ప్రతిభను కనబరుస్తున్నారని అన్నారు. ఎంచుకున్న రంగం ద్వారా సమాజ సేవలో పాలుపంచుకోవడం గర్వకారణమన్నారు. ఒకప్పుడు మహిళలు వంటింటికే పరిమితమయ్యారని, కానీ నేడు అంతర్జాతీయంగా మహిళా హక్కుల సాధన కోసం పోరాటాలు చేయటం అభినందనీయమని అన్నారు. దేశంలో ప్రథమ పౌరురాలుగా మహిళలకు అవకాశం దక్కటం హర్షణీయమన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో కూడా మహిళలు రాణిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు కూడా మహిళా సాధికారతకు కషి చేయాలన్నారు. గ్రామీణ పేద మహిళలు స్వయం శక్తితో ఎదుగుతూ కంటుంబ పోషణ చేస్తూ, సమాజంలో పురుషులతో సమానంగా గుర్తింపబడుతున్నారని పేర్కొన్నారు. అయితే నేటి ఆధునిక యుగంలో కూడా మహిళలపై దాడులు, వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. వీటి నివారణకు ప్రవేశపెట్టిన మహిళా చట్టాలపై అవగాహన కల్పించి, మహిళల రక్షణకు పాలకులు చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు.


మహిళా సాధికారతకు కృషి చేయాలి

కంచికచర్ల సర్పంచ్ వేల్పుల సునీత

ప్రజాశక్తి-కంచికచర్ల : సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు మహిళా సాధికారతకు కృషి చేయాలని కంచికచర్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ వేల్పుల సునీత అన్నారు. అంతర్జాతీయ




మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె ప్రజాశక్తికి ఇంటర్వ్యూ ఇస్తూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల గడిచినా మహిళలపై దాడులు, వేధింపులు ఆగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల నాయకులు మహిళల రక్షణ కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తున్నారన్నారు. కానీ నేటికీ సమాజంలో ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. రాజ్యాంగంలో మహిళలకు పొందుపరిచిన హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుకు పాలకులు కషి చేయాలన్నారు. నేడు మహిళలు విద్య, వైద్య రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారని, అయినా మహిళా హక్కుల సాధించలేకపోవటం దురదష్టకరమని అన్నారు. రాష్ట్రంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని అన్నారు.




















మహిళా అధికారుల పాత్ర అభినందనీయం : కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి)

రంగాల్లో ఎన్‌టిఆర్ జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపడంలో మహిళా అధికారుల కృషి మరువలేనిదన్నారు.తొలుత సబ్ కలెక్టర్ అదితి సింగ్, అడిషనల్ డిసిపి పి. వెంకటరత్నం, జిల్లా వ్యవసాయ అధికారి ఎం.విజయభారతి, డ్వామా పీడీ జె. సునీత, ఐసిడిఎస్ పీడీ జి.ఉమాదేవి, డిసిఎస్‌వో పి. కోమలిపద్మ, డియంహెచ్‌వో డా. యం సుహాసిని, మార్క్‌ఫెడ్ యండి నాగమల్లిక, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ యం వి. విజయభారతి, హౌసింగ్ పిడి శ్రీదేవి, జిల్లా సైనిక సంక్షేమాధికారి కాక్టర్ కె.కళ్యాణ వీణా, గ్రామ వార్డు సచివాయల ప్రత్యేక అధికారి కె.అనురాధ, సిపివో రత్నరూత్, వియంసి జోనల్ కమిషనర్ జి.సృజన, అడిషనల్ కమిషనర్ శ్యామల, డిప్యూటీ కమిషనర్ వెంకటలక్ష్మి, యుడిసి ప్రాజెక్టు ఆఫీసర్ శకుంతలను కలెక్టర్ సన్మానించారు. అనంతరం మహిళా అధికారులు కలెక్టర్‌ను దుశ్శాలువ, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.



కళాకారులను ఆదుకుంటాం : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : 58 ఏళ్లు నిండిన నిరుపేదలైన కళాకారులకు నెలకు రూ.3 వేల చొప్పున ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేస్తోందని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన కళాకారులకు మంజూరైన గుర్తింపు కార్డులను మంగళవారం ఆయన తన కార్యాలయంలో అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ఎన్‌టిఆర్ జిల్లాలో ఇప్పటికే అర్హులైన 195 మంది వృద్ధ కళాకారులకు పెనన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. మరో 3,463 మంది డప్పు కళాకారులకు ప్రతి నెలా రూ.3 వేల చొప్పున కోటీ 38 లక్షల 90 వేలు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో అర్హత కలిగిన కళాకారులకు గుర్తుంపు కార్డులను మంజూరు చేస్తామన్నారు. అనంతరం డప్పు కళాకారులు కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి యు.సురేంద్రనాథ్, డిపిఆర్ఓ ఎస్‌వి మోహన్‌రావు, ఆడియో విజువల్ సూపర్‌వైజర్ ఎ.సాయిబాబా, పబ్లిసిటీ అసిస్టెంట్ వివి.ప్రసాద్, కెవిపిఎస్ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి జి.నటరాజు, నాయకులు సిహెచ్.శ్రీనివాస్ పాల్గొన్నారు.


డిటిసి కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - విజయవాడ : పురుషులతోపాటు స్త్రీలకు కూడా సమాన అవకాశాలు, హక్కులు కల్పించడం ద్వారానే సమానత్వం సాధ్యమవుతుందని డిటిసి ఎం.పురేంద్ర అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎంజి రోడ్డులోని డిటిసి కార్యాలయంలో మంగళవారం ఆ శాఖ మహిళా ఉద్యోగులు, కార్యాలయానికి వచ్చిన మహిళలతో కేక్ కట్ చేయించారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిటిసి పురేంద్ర ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ ఆర్.జగదీశ్వరరాజు, మోటారు వాహన తనిఖీ అధికారులు ఆర్.ప్రవీణ్, ఎస్.శ్రీనివాసు, కె.లాజర్ బాబు, కార్యాలయ అధికారులు సిహెచ్.శ్రీనివాసరావు, కెవివి.నాగమురళి, కె.రామచంద్ర రాజు, మహిళా ఉద్యోగులు చంద్రకళ, భవాని, అరుణ, శ్యామల, దివ్య, మణిస్విని పాల్గొన్నారు.



ఐద్వా ఆధ్వర్యాన మహిళా దినోత్సవ వేడుకలు

విస్సన్నపేట : ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం విస్సన్నపేటలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా సంఘం మండల అధ్యక్షులు వినుకొండ రంగారాణి కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరువూరు న్యాయవాది మేకల నాగేంద్రప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, డివైఎఫ్ఐ నాయకులు కిషోర్, దుర్గారావు, ఎస్ఎఫ్ఐ నాయకులు సునీల్, ఐద్వా నాయకులు చాట్ల లక్ష్మి, రమాదేవి, రమణ, కపారత్నం పుష్ప, ఎమ్‌డి.అమిత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురించి మాట్లాడిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ కరువవుతుందన్నారు. నిరంతరం మహిళపై దాడులు జరుగుతు న్నాయని, చట్టాలున్నా ఉపయోగం లేకుండా పోతోందని అన్నారు. ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమవుతు న్నాయని, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించలేని స్థితిలో పాలకులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



రోజూ భయమే...

చీకటి పడాలంటే
రాత్రికి భయం
ఏ క్రూరత్వం మనిషిలో
ఏ రూపంలో నిద్రలేస్తోందోనని.....

తెల్లవారాలంటే
పగటికి సిగ్గు
ఏ నీచత్వం ఎక్కడ బయటపడి
లోకం తలదించుకోవాలోనని...

రోజు గడిచేకొద్దీ
భూమికి గుండెల్లో బరువు
మనిషిని మోసే శక్తి సన్నగిల్లి
ఎప్పుడు కుప్పకూలుతానోనని...

-సిహెచ్.నారాయణరావు,9704437247

తరువులూ తరుణులూ

తరువులూ తరుణులూ
తరువో తరుణో
పరులకోసం పాటుపడని
పుటకేం పుటకని?
పచ్చదనాలను ప్రసవిస్తూ తరువు
శిశిర మానుల నుండి శిరశెత్తి
చిగురించే అవసరాన్ని
లోకానికి గుర్తుచేస్తూ ఉంటుంది

తరువులూ తరుణులూ
ఒకరిని ఒకరు పోలి వుంటారేమో
జీవజలాల్ని తోడి
సేవా సుమాలుగా విచ్చుకుంటూ ఒకరు
అమత ఫలాలై పండి
మాధుర్యపు రుచులు పంచుతూ ఒకరు
విరగ పండిన తరువునెపుడైనా చూసారా?
రెండు చేతులా పిల్లల్ని పొదువుకున్న
అమ్మలాగా ఉండదూ!
ప్రాణవాయువును ధారపోస్తూ ఒకరు
ప్రాణాలకు ప్రాణజం పోసి ఒకరు
తమ గర్భలలో ప్రేమను పొదిగి
సేవను ప్రసవిస్తూ వుంటారు
పరుల అవసరాలకు బీర తీగల్లా అల్లుకుని
చేతులు సాచి నీడలు పరుస్తారు
కమ్మ తెమ్మరలై వీచి
గుప్పెళ్లతో హాయిని పంచుతారు
పున్నగపూలు జల జలా రాలినట్లు
ప్రేమ దారలై కురిసిన
జీవసారమై మొలకెత్తుతారు
అల్లకల్లోల అపసవ్య లోకంలో
మిన్ను విరిగి ఇంకా మీదపడలేదంటే
ఎందుకు అసలైన కారణం
అమ్మలూ కొమ్మల కరుణ కాదో!
ఎందుకంటే వాళ్ళు
మట్టిమీద మిగిలిన జీవసంతకాలు!

- శారద ఆవాల, 9295601447









మహిళలు స్వశక్తితో ఎదగాలి

డాక్టర్ పి.శ్రీలత, ప్రధాన శాస్త్రవేత్త, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల

ప్రజాశక్తి-ఘంటసాల



మహిళలు విద్యావంతులై ఇతరులపై ఆధారపడకుండా స్వశక్తితో ఆర్థిక స్వలంబన కలిగి ఉండటం వల్ల మహిళా దఢత్వం సాధ్యమవుతుంది. మహిళా అభ్యున్నతి సాధించడం కోసం కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా మహిళలు స్వతహాగా వివిధ రంగాల్లో స్థిరపడే విధంగా అనేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రతి మహిళ ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుంటూ వారి జీవితాల్లో స్థిరపడాలని కోరుకుంటున్నాను.

నాన్న డాక్టర్ కల నెరవేర్చిన వేళ

- డాక్టర్ పి.రేవతి, సబ్జెక్ట్ మెటల్ స్పెషలిస్ట్ సస్య రక్షణ విభాగం, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల

ప్రజాశక్తి-ఘంటసాల



తండ్రి చనిపోవడంతో మధ్యలో ఆగిపోయిన పిహెచ్‌డిని కృషి పట్టుదలతో తండ్రి కల నెరవేర్చాలని ఆశయంతో కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో పూర్తి చేయటం ఎంతో సంతోషాన్నిచ్చింది. ప్రతి మహిళ ఒక బలమైన నమ్మకంతో ధైర్యంగా జీవించాలి. తద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చు. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే విజయం తథ్యం.

సమన్వయంతో ముందుకు సాగాలి

డాక్టర్ మంజువాణి, సబ్జెక్ట్ మెటల్ స్పెషలిస్ట్ ఉద్యాన విభాగం, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల

ప్రజాశక్తి-ఘంటసాల



మహిళలు కుటుంబాన్ని, వృత్తినీ సమన్వయం చేసుకుంటూ అవకాశాలను అందిపుచ్చుకుంటూ స్వతహాగా తన కాళ్ళపై తాను నిలబడే లాగా దఢ సంకల్పంతో ఉండాలి. లక్ష్యసాధన కోసం కష్టించి పనిచేస్తే విజయం తథ్యం. మహిళలు అన్ని రంగాల్లో నేడు రాణిస్తున్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి. మరింత ఉన్నత స్థానాల్లోకి వెళ్లటానికి కృషిచేయాలి. మహిళలు అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత

పెదపారుపూడి ఎస్ఐ పి.నాగకళ్యాణి

ప్రజాశక్తి-పెదపారుపూడి

శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పెదపారుపూడి ఎస్ఐ పి.నాగకళ్యాణి చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు.



74 వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేసినందుకు గాను జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ జాషువా చేతుల మీదుగా ఉత్తమ ఎస్ఐ పురస్కారాన్ని అందుకున్నట్లుగా తెలిపారు. ఉత్తమ సేవలు అందించినందుకు గాను ప్రశంస పత్రాన్ని అందుకున్నానని చెప్పారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండటం ఎంతో సంతోషదాయకమన్నారు. మండల ప్రజలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళలకు ఆమె శుభాకాంక్షలు తెలియ చేశారు. శాంతిభద్రతల కల్పనలో మహిళలు చేస్తున్న కృషి కూడా అభినందనీయమన్నారు. రాబోయేరోజుల్లో మరింతగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.

సమానత్వం ఇంటి నుండే ప్రారంభం కావాలి

కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజితసింగ్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)



స్త్రీ, పురుషులు ఇద్దరు సమానం అనే భావన ఇంటి నుండే ప్రారంభం అయ్యేలా తల్లిదండ్రులు కృషి చేయాలని కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాధిత సింగ్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె ప్రజాశక్తికితో మాట్లాడారు. స్త్రీ, పురుషులు సమానం అనే భావన తల్లిదండ్రులు చిన్నప్పటి నుండే పిల్లలకు అవగాహన కల్పిస్తే సమాజంలో వివక్ష ,వేధింపులకు అవకాశం ఉండబోదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. డిజిట్ ఆల్ - లింగ సమానత్వం కోసం సాంకేతికత, ఆవిష్కరణ ప్రధాన అంశంతో ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. సాంకేతికను వినియోగించడంలో మహిళలు జిల్లాలో చాలా ముందడుగు వేశారన్నారు. ఈ నేపథ్యంలోనే ఏఎన్ఎం, మహిళా పోలీస్, అంగన్వాడీ టీచర్స్ వారి విధులలో భాగంగా సాంకేతికత వినియోగిస్తూ నివేదికలు ఇస్తున్నారన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యార్థులకు ట్యాబుల ద్వారా విద్యాభోదన చేస్తున్నారన్నారు. ప్రభుత్వం సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు 8 ప్రధాన ఇండికేటర్స్‌లో మహిళా సాధికరతే ముఖ్యమన్నారు. అలాగే ఒక్కరోజులో ఎవరికి సక్సెస్ స్టోరీ రాదన్నారు. అది నిరంతర ప్రక్రియగా గుర్తుచేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, సావిత్రి బాయి పూలే చెప్పిన విధంగా ప్రతి ఒక్కకూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అలా ఇచ్చిన నాడు ఎన్నో రుగ్మతలు నివారించబడతాయన్నారు.

మహిళలను చూసే ధోరణి మారాలి

కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారి తాహేరా సుల్తానా

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)



మహిళలు బయటకు వచ్చినప్పుడు సమాజం చూసే ధోరణి మారినప్పుడే మహిళల పట్ల వివక్ష, లైంగిక వేధింపులు తగ్గుతాయని కృష్ణాజిల్లా విద్యాశాఖ అధికారి తాహేరా సుల్తానా పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. నేడు అన్ని రంగాల్లో సగానికి పైగా మహిళలు తమ ప్రతిభను చాటుతున్నారన్నారు. ఎంత వేగంగా మహిళలు అన్ని రంగాల వైపు దూసుకెళ్తున్నారో వారి పట్ల వివక్ష అదే విధంగా కొనసాగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రస్తుత నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. వారి పట్ల లైంగిక వివక్ష అదే స్థాయిలో కొనసాగుతోందన్నారు. వీటిని పూర్తిస్థాయిలో అరికట్టాలంటే మహిళలు బయటకు వచ్చినప్పుడు చూసే ధోరణి మారాలని అలాంటప్పుడే మహిళలపై వేధింపులు వివక్ష అరికట్టగలుగుతామన్నారు. అలాగే మహిళల పట్ల వేధింపులకు పాల్పడితే కఠిన చట్టాలు ఉన్నాయని వాటిపై ఇంకా విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా పాఠశాల స్థాయిలో విద్యార్థులపై వివక్ష, లైంగిక వేధింపులు అరికట్టేందుకు పాఠశాల స్థాయి నుంచి చైల్డ్ సేఫ్టీ పై ఒక సెక్షన్ పెట్టారన్నారు. ప్రతి పాఠశాలలో డ్రాప్ బాక్స్ కూడా ఏర్పాటుచేశారన్నారు.

స్వయం శక్తితో ఎదగాలి

పమిడిముక్కల తహశీల్దార్ రాజ్యలక్ష్మి

పమిడిముక్కల : గతంతో పోల్చుకుంటే నేటి సమాజంలో మహిళ పాత్ర గణనీయంగా పెరిగిందని పమిడిముక్కల తహశీల్దార్ రాజ్యలక్ష్మి చెప్పారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. అన్ని రంగాల్లో మహిళల పాత్ర పెరగటంతో ఎంతో సంతోషించదగ్గ విషయమని చెప్పారు. సమానత్వం అంటే పురుషులతో పాటుగా స్త్రీలకు కూడా సమాన అవకాశాలు, హక్కులు కల్పించడమేనని వివరించారు. నేడు పురుషులతో పాటుగా మహిళలు కూడా సమాన అవకాశాలు పొందేస్థాయికి రావడం, వాళ్ళ ల్లో ఉన్న ఆత్మ విశ్వాసమే వాళ్ళ గెలుపునకు కారణమన్నారు. నేటి భారతీయ మహిళలు అన్ని రంగాల్లో రాణించటం ఎంతో గర్వకారణమని చెప్పారు.

మహిళల కృషి అభినందనీయం

పమిడిముక్కల మండల పరిషత్ అధ్యక్షురాలు కాసాని వేదసుప్రజ

నేడు విద్య, రాజకీయాలు, మీడియా, కళలు, సంస్కృతి, విద్య, వైద్యం, ఆరోగ్యం, సేవా విభాగాలు, విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో మహిళలు రాణిస్తుండటం ఎంతో సంతోషకరమైన విషయమని పమిడిముక్కల మండల పరిషత్ అధ్యక్షురాలు కాసాని వేదసుప్రజ చెప్పారు. ఆమె ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. అన్ని రంగాల్లో పురుషులకు ధీటుగా మహిళలు రాణిస్తున్నా పురుషాధిక్య సమాజంలో కొన్నిచోట్ల స్త్రీ నేటికీ అణచివేతకు గురవుతూనే ఉండటం చూస్తున్నామన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న సిఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ కృషి అద్వితీయం

పమిడిముక్కల జడ్‌పిటిసి సభ్యురాలు ఏనుగు వెంకట రమణ కుమారి

మహిళల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి నిరంతరం చేస్తున్న కృషి ఎంతో అద్వితీయం, అభినందనీయమని పమిడిముక్కల జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగు వెంకటరమణకుమారి చెప్పారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. సిఎం జగన్ ఇచ్చిన ప్రోత్సాహంతోనే నేడు మహిళలు వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో మంచిగా రాణిస్తున్నారన్నారు. సిఎం జగన్ బాటలోనే పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్‌కుమార్ నడుస్తూ మహిళల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు సరస్వతి

ప్రజాశక్తి కలెక్టరేట్ (కృష్ణా)




నేటి సమాజంలో ప్రతి మహిళ చదువుకు ప్రాధాన్యతనిస్తూ ఆత్మస్థైర్యం దండిగా కలిగి ఉండాలని అలాంటప్పుడే మహిళలు అన్ని రంగాల్లో రాణించగలుగుతారని సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు కె.సరస్వతి పేర్కొన్నారు. మహిళా దినోత్సవ సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. దీంతోపాటు చదువు పట్ల కూడా మక్కువ చూపిస్తూ ఆత్మ స్థైర్యం దండిగా కలిగి ఉంటే సమాజంలో జరిగే వివక్ష, లైంగిక వేధింపులు ఎదుర్కోగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు కూడా ఆ విధంగా కషి చేయాలని పిలుపు నిచ్చారు.ఇప్పటికే ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అలాంటి అవకాశాలను ప్రతి మహిళా అంది పుచ్చుకోవాలని కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

మంచి విజయాలు సొంతం

కపిలేశ్వరపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మమత

ప్రజాశక్తి-పమిడిముక్కల

మహిళలు అన్ని రంగాల్లో ప్రవేశించి మంచి విజయాలను సాధిస్తున్నారని పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ మమత చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య పథకాల ద్వారా రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ స్కీం కూడా ఎంతో గొప్పదని వివరించారు.



రోగులకు మెరుగైన, నాణ్యమైన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందించటానికి రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కొంత సానుకూల ధోరణి శుభపరిణామం

సూరపనేని విజయలక్ష్మి, వైఎస్సార్ తాడిగడప మున్సిపల్ మేనేజర్

పెనమలూరు : గతంతో పోలిస్తే కుటుంబంలోనూ, సమాజంలోనూ మహిళల పట్ల సానుకూల ధోరణి బాగా పెరగటం ఎంతో శుభపరిణామం. దానిని అందుకుని నేడు మహిళలు అన్ని రంగాల్లో అడుగిడటమే కాక ఆ రంగంలో అత్యున్నత స్థాయిని అందుకుంటున్నారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రకాలుగా సహకరిస్తున్నాయి. ముమ్ముందు ఆకాశంలోనూ, అవకాశాలలోనూ, సగం కాదు. మూడొంతులు కూడా మహిళలదే అనేలా మహిళల అభివృద్ధి ఉంటుంది. అయితే రాజకీయ ప్రాతినిధ్యంలో మాత్రం ఈ పురోగతి అంతంత మాత్రంగానే ఉంది. ఒక వైపు ఇది ఎంతో ఆశాజనకంగా ఉంటే మరోవైపు కొన్ని విపరీతమైన సంఘటనలు వింటుంటే మాత్రం ఆడపిల్లల పట్ల యువకుల ధృక్పధం ఆందోళన కల్గిస్తోంది. ఆ దృక్పథం అలా ఉండటానికి కారణమైన వ్యవస్థలేమిటో మనందరికీ తెలుసు. ఇవాళ మనం మహిళల హక్కుల గురించి కాక ఆ వ్యవస్థల మార్పుకోసం పోరాటం చేయాల్సివుంది.



మహిళలందరికీ శుభాకాంక్షలు

డాక్టర్ పద్మజ

పమిడిముక్కల : అంతరాజతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పద్మజ, ఐనపూరు సర్పంచ్ కొండ జయలక్ష్మి, లంకపల్లి గ్రామ కార్యదర్శి విజయ దుర్గ, తాడంకి గ్రామ కార్యదర్శి సునీత, మంటాడ గ్రామ సర్పంచ్ నందమూరి వీరమ్మ, కష్ణాపురం గ్రామ కార్యదర్శి పావని తెలిపారు. రాబోయేరోజుల్లో మరింతగా అన్ని రంగాల్లో రాణించాలని వారు కోరారు. ఆమె మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలపై దాడులను అరికట్టాలి : ఐద్వా

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: మహిళలు అన్ని రంగాలలో పురుషునితో సమానంగా పనిచేస్తున్నారని పలువురు వక్తలు అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో తాడిగడపలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కార మార్గాలు అనే అంశంపై మంగళవారం సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.స్వరూపారాణి మాట్లాడుతూ మహిళలపై జరిగే దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి స్కూల్ ప్రిన్సిపాల్ కోటమరాజు, ఐద్వా మునిసిపల్ పట్టణ కార్యదర్శి పాతాళ లక్ష్మి, ఐద్వా నాయకులు జి.జయలక్ష్మి, ఎస్.కె. హుస్సేన్‌బి, ఆర్.దుర్గ, సీతామహాలక్ష్మి, ఎస్.కె. బీజాన్‌బి, ఐద్వా మునిసిపల్ కమిటీ అధ్యక్షులు ఎస్.కె.మలీమా పాల్గొన్నారు.



శ్రీచైతన్యలో మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-నందిగామ: రైతుపేట శ్రీ చైతన్య పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఆటపాటలతో గడిపారు. చిన్నారులతో కలిసి తల్లులు స్టేజి మీద చేసిన నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ గుత్తా ప్రదీప్, పెండ్యాల గురువు మహమ్మద్, పెనుగంచిప్రోలు జడ్పీహెచ్‌ఎస్ హెడ్మాస్టర్ జలజ, ప్రైమరీ ఇంచార్జ్ వందన, ఈజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-నందిగామ: ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పదో తరగతి మోడల్ పరీక్షలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నందిగామ జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం ఎమ్మెల్సీ కెయస్ లక్ష్మణరావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యం పెట్టుకొని ముందుకు వెళ్లాలని, విద్యారంగంలో వస్తున్న మార్పులను గమనించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైతన్య కళాశాల డైరెక్టర్ అమరనేని కార్తీక్, ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎం.సోమేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా ట్రెజర్ మహేశ్వర వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు ఎం.రాంబాబునాయక్, ఎస్ఎఫ్ఐ నందిగామ డివిజన్ కార్యదర్శి జి.గోపినాయక్ తదితరులు పాల్గొన్నారు.




మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయవాడ: మునిసిపల్ కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించి, సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని, లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు హెచ్చరించారు. విఎంసిలో పని చేస్తున్న మునిసిపల్ ఆప్కాస్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలని కోరుతూ మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా జరిగింది. ధర్నాకు బాబూరావు మద్దతిచ్చి మాట్లాడుతూ గతంలో ఎన్నో ప్రభుత్వాల నుండి కొనసాగుతున్న పెన్షన్లు, సంక్షేమ పథకాలు జగన్ ప్రభుత్వం రద్దు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు టి.ప్రవీణ్, యూనియన్ నగర అధ్యక్షులు ఎస్ జ్యోతిబస్, నాయకులు తిరుపతమ్మ, జైపాల్, నాగమణి, ఉప్పు శ్రీను, దాసు తదితరులు పాల్గొన్నారు.



పోతురాజు శేషయ్య విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడరూరల్: కొత్తూరు తాడేపల్లికి చెందిన గౌడ సంఘం మాజీ అధ్యక్షులు పోతురాజు శేషగిరిరావు (శేషయ్య) ప్రథమ వర్ధంతి సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాన్ని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రవాణా రంగం, గౌడ సంఘం ఉన్నతికి పోతురాజు శేషయ్య విశేష కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు, వైసిపి నాయకులు కాటమనేని పూర్ణచంద్రరావు, కారంపూడి సురేష్, శివాజీ, పోతురాజు మాధవరావు, గోపీ, వార్డు సభ్యులు రాజులపాటి వెంకటేశ్వరరావు, వైసీపీ మండల అధ్యక్షులు రవికిశోర్ తదితరులు పాల్గొన్నారు.



తక్షశిల ఐఎఎస్ అకాడమీతో ఎస్ఆర్ఆర్ ఒప్పందం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విద్యార్థులకు సివిల్ సర్వీస్‌లో కోచింగ్ ఇచ్చేందుకు నగరానికి చెందిన తక్షశిల ఐఎఎస్ అకాడమి, ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ కళాశాల పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. మాచవరంలోని కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. తక్షశిల ఐఎఎస్ అకాడమి డైరెక్టర్ బిఎస్ఎన్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ యూపీఎస్‌సి, ఏపీపీఎస్‌సి పరీక్షలకు సంబంధించి కెరీర్ గైడెన్స్, కోచింగ్ అందించడానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో భాగస్వాములు అవడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి సివిల్స్‌లో శిక్షణ తీసుకుని మంచి ర్యాంకు సాధించాలని అనుకుంటారని, అటువంటి వారికి మంచి శిక్షణ అందించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమం రూపకల్పన చేసినట్లు తెలిపారు.



తిరుపతమ్మ చినతిరునాళ్లు ప్రారంభం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ అమ్మవారి చిన్నతిరునాళ్లు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 5.59 గంటలకు ఆలయ ఇఓ లీలాకుమార్, చైర్మన్ చెన్న కేశవరావు ఉత్సవాలను ప్రారంభించారు. సర్పంచ్ పద్మ కుమారి, ఎంపీడీవో ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి శ్యామ్ అధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఇందిరా పర్యవేక్షణలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ లక్ష్మి కళ్యాణి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు యాత్రికులకు సేవలందిస్తున్నారు. కన్నేటి వెంకట రమణ, చుంచు హైమవతి రూ.35 వేలు విలువ చేసే వెండి వస్తువులు విరాళంగా అందజేశారు.









